ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 26.0


కలెక్టర్‌ను అభినందిస్తున్న రిటర్నింగ్ అధికారులు

కలెక్టర్ కృషి స్ఫూర్తిదాయకం : జేసీ

ఏలూరు కలెక్టరేట్, జూన్ 8 : జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ చేసిన కృషికి అందరికి స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, రిటర్నింగ్ అధికారులు, ఐటీడీఏ పీవో సూర్యతేజ, ఆర్డీవో ఖాజావలీ తదితర రిటర్నింగ్ అధికారులు అన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసిన సందర్భంగా జిల్లాలోని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు కలెక్టర్ క్యాంప్ కార్యా లయంలో కలెక్టర్‌ను శనివారం కలిసి పూల మొక్కను అందించి అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారుల కృషి, వారు అందించిన సహకారం మరువలే నిదన్నారు. ఎన్నికల నిర్వహణలో సహకరించిన అధికారు లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములైన మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు ఆయన తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్స్ ఏర్పాటు, కౌంటింగ్ హాళ్ల ఏర్పాటుకు అన్ని విధాలా సహకరించిన సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఎడ్‌సెట్ పరీక్ష ప్రశాంతం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 8 : బీఎడ్ కోర్సులో ప్రవేశాలకు శనివారం నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్-2024 ఆన్‌లైన్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ పరీక్షా కేంద్రంలో 100 మంది అభ్యర్థులకు 74 మంది, సిద్ధార్థ క్వెస్ట్ పరీక్షా కేంద్రంలో 181 మందికి 153 మంది హాజరయ్యారు.

రెండు రోజులు సంతాప దినాలు : కలెక్టర్

ఏలూరు సిటీ, జూన్ 8 : పద్మ విభూషణ్, ఈనాడు గ్రూపు ఆఫ్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు మృతికి నివాళులర్పిస్తూ రెండు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం సంతాప దినాలుగా ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. ఈనెల 9, 10 తేదీలను సంతాప దినాలుగా ప్రకటిస్తూ సాధారణ పరిపాలనా శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రెండు రోజుల పాటు జాతీయ పతాకాన్ని సగం వరకు అవనతం చేయాలని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అధికారికంగా ఏ వేడుకలు నిర్వహించరాదని పేర్కొంటూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు.



భక్తజన సంద్రం..
శ్రీవారి క్షేత్రం
-7లో

నామినేటెడ్ నజర్!

పనిచేసిన వాళ్లకే పదవి.. ఇదే కూటమి నినాదం

- క్షేత్రస్థాయి కార్యకర్తలకు త్వరలో ఛాన్స్
- నియోజకవర్గాల వారీగా కసరత్తు
- మూడు నెలల్లోనే పెనుమార్పుకు సిద్ధం
- ఈలోపే నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారిని తప్పించేలా ఆదేశాలు

ఎన్నికల రణంలో తెగించి సొంతపార్టీ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో నిద్రాహారాలు మాని, పోరాడిన కార్యకర్తలు ఎవరు. అక్రమ కేసులకు వెరవకుండా, నిందారోపణలు లెక్కచేయకుండా జెండానే.. మా అజెండాగా భావించిన నేతలు ఎవరు.. గత అనుభవాలను నెమరవేసుకుని త్యాగాలకు వచ్చి, వైసీపీ అక్రమాలకు అడ్డుకట్టవేసి ప్రాణాలకు తెగించి పార్టీని నిలబెట్టిన వారందరికి కూటమి నాయకత్వం త్వరలోనే 'కృతజ్ఞత' చెప్పబోతోంది. అర్హత కలిగిన నామినేటెడ్ పోస్టుల్లో నియమించాలని కూటమి నాయకత్వం తలపోస్తోంది.



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఐదేళ్లపాటు జగన్ ప్రభుత్వంలో అక్రమ కేసులకు ఎదురొడ్డి పార్టీ కోసం నిలబడ్డ సాధారణ కార్యకర్తలకు పదవులు ఇచ్చి గౌరవించాలని భావిస్తున్నారు. ఐదేళ్లలో కులాల వారీగా కార్పొరేషన్‌లు ఏర్పాటుచేశారు. ఛైర్మన్ లు, పాలక సభ్యులను నియమించారు. ఎంతసేపటికి రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ నియామకాలన్నీ సాగాయి. రాజకీయ నిరుద్యోగతను దృష్టిలో పెట్టుకుని కులానికో కార్పొరేషన్ ఏర్పాటుచేశారు. పాలక మండలిని ఏర్పాటుచేశారు. గౌరవ వేతనం ఇచ్చారు. కొన్నింటికి కార్యాలయాలు పెట్టి సిబ్బందిని నియమించి హంగామా చేశారు. ఇదేదో తమ సామాజికవర్గ అభివృద్ధికి పనికి వస్తుందని కొత్తలో అంతా భావించారు. ఎడాపెడా నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీ చేశారు. ఉమ్మడి పశ్చిమలో వివిధ కార్పొరేషన్‌ల ఛైర్మన్ పదవి దక్కిన వారు ఉన్నా రు. సాహిత్య అకాడమి ఛైర్మన్‌గా పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్‌గా గుబ్బల తమ్మయ్య ఈడా ఛైర్మన్‌గా కొన్నాళ్ళపాటు ఎంఆర్డీ ఈశ్వరిని, ఏలూ రు స్మార్ట్ సిటీ ఛైర్మన్‌గా మరొకరిని, వడ్డీల కార్పొరేషన్ ఇంకొకరిని, ఆక్వా అథారిటీ ఛైర్మన్‌గా రఘురామ్‌ను, ఎంటీసీ ఛైర్మన్‌గా పెంద్ర వీరన్నను నియమించారు. క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నెడ్‌క్యాప్ డైరెక్టర్‌గా పలువురిని గత ప్రభుత్వంలో నియమించారు. వాస్తవానికి వీరి నియామకం తర్వాత జిల్లాలో అయా వర్గాలకు అదనపు సంక్షేమం జరిగితే ఒట్టు. కార్పొరేషన్‌లన్నింటిని నామినేటెడ్ పదవులతో నింపేశారే తప్ప వాటి మనుగడకు అవసరమైన మార్గ నిర్దేశాన్ని చేయలేకపోయారు. గౌరవ వేతనాలు ఇచ్చే వేదికలుగా అవకాశం ఇచ్చారు. వైసీపీ విజయానికి అప్పట్లో కష్టపడినందుకు జగన్ ప్రభుత్వం ఛైర్మన్‌గా నియమించి కొందరికి కృతజ్ఞత తెలిపింది. ఈ ఐదేళ్ల వీరంతా ఏమీ చేయలేక నిస్సహాయం గా మిగిలిపోయారు. ఏలూరు స్మార్ట్‌సిటీ ఛైర్మన్ పదవికి కొన్నాళ్ళపాటు ఛైర్మన్‌గా నియమించి ఆ తర్వాత ఆ ఒక్కర్ని పదవి నుంచి తొలగించారు. నియమ నిబంధన లకనుగుణంగా ఆ పదవి లేకపోవడమే కారణం. ఈడా ఛైర్మన్‌గా నియమించి కొన్నాళ్ళ పాటు ఇంకొకరికి ఆ పదవి ఇచ్చేందుకు చివరిలోనూ ప్రయత్నించారు. ఇవన్నీ అప్పట్లో అధికార వైసీపీలోనే కొత్త గందరగోళానికి దారి తీశాయి. వైసీపీ భావించినట్టు ఎన్నికల సమయంలో వీరందరి నుంచి పెద్ద ఎత్తున ఓట్లు పొందలేదు సరి కదా, నామమాత్రంగా వీరిప్రభావం పడలేదు. కారణం.. అధికార వైసీపీలో ఏకపక్ష విధానం, జగన్ అంతా తానే వ్యవహరించడం, అధికారుల మాట వినకపోవడం, వలంటీర్ల పెత్తనం పెరగడం.. ఇవన్నీ కలిసొచ్చి వైసీపీ పతనానికి దారి తీశాయి. ఈ గందరగోళం వ్యవహారాన్ని కూటమి నాయకత్వం సమీక్షించబోతోంది. ఎక్కడికక్కడ నామినేటెడ్ పోస్టుల్లో ఇప్పటికే ఉన్న వారందరిని రాజీ నామాలు చేస్తూ వైదొలగాల్సిందిగా ఆదేశాలు వెలువడ్డాయి. సాధారణంగా ప్రభుత్వం మారిన వెంటనే నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారంతా రాజీనామాలు చేసి తమ నైతికత ప్రదర్శిస్తారు. ఇప్పటికే కొందరు వైసీపీ అనుకూలురు నామినేటెడ్ పోస్టులకు రాజీనామాలు చేస్తే ఇంకొందరు అంటి పెట్టుకుని ఉన్నారు. వీరందర్నీ పూర్తిగా తొలగించి ఆ తదుపరి కూటమి పక్షాన కష్టపడిన వారందరికి అవకాశం ఇవ్వను న్నారు.

ఈడా ఎవరి సొంతం ?

2014లో అధికార పగ్గాలు చేపట్టిన టీడీపీ అప్పట్లోనే పట్టణాభివృద్ధికి ప్రత్యేకంగా చొరవ తీసుకుంది. దీనిలో భాగంగానే ఏలూరు అర్బన్ అథారిటీ ఏర్పాటైంది. తొలి ఛైర్మన్‌గా ఉప్పాల జగదీష్‌బాబు నియమితులైన కొద్దికాలానికే తెలుగుదేశం అధికారం కోల్పోయింది. ఆ తదు పరి అధికారంలోకి వచ్చిన వైసీపీ తొలుత ఎమ్ఆర్డీ ఈశ్వరిని ఈ పదవిలో నియమించింది. ఆ తదుపరి బొద్దాని శ్రీనివాస్‌ను నియమించారు. దీంతో వైసీపీలో కొంత వివాదం చోటు చేసుకుని ఆ పార్టీ నుంచి ఎమ్ ఆర్డీ బలరామ్ బయట పడ్డారు. ఈసారి ఆయన టీడీపీ విజయానికి కష్టపడి పని చేశారు. తిరిగి అదే పదవి తన కుటుంబానికి వచ్చేలా చూడాలని ఆయన కోరుతున్నారు. ఏలూరు కేంద్రంగా పనిచేసిన వారిని మాత్రమే ఈ అవకాశం దక్కే పరిస్థితి ఉండడంతో టీడీపీ నేతలంతా ఇప్పుడు టెన్షన్ ఫీలవుతున్నారు. కీలకమైన ఈడా ఛైర్మ న్ పదవి కోసం కొద్ది రోజుల్లోనే మరికొద్దిమంది రంగం లోకి దిగే అవకాశం లేకపోలేదు.

మిత్రపక్షాలపై త్వరలో స్పష్టత

నామినేటెడ్ పోస్టుల భర్తీలో మిత్రపక్షాలకు చోటు ఇవ్వాలా? లేదా? అనే దానిపైన కీలక నిర్ణయం తీసుకో వాల్సి ఉన్నందున రాబోయే మూడు నెలల్లో వీటి కస రత్తు మరింత వేగమయ్యే అవకాశం ఉన్నాయి. తొలుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లాల వారీగా నామినేటెడ్ పోస్టుల సంఖ్య సమాంతరంగా ఈ పదవు లను ఆశిస్తున్న వారి సంఖ్య పరిగణనలోకి తీసుకుని అందరికి ఆమోదయోగ్యమైన జాబితాలను వెలువరించే దిశగా ఈ లోపే సుదీర్ఘ కసరత్తు జరిగే అవకాశం ఉంది. ప్రత్యేకించి బీసీ వర్గాలు, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని చానాళ్ళుగా డిమాండ్ ఉంది. ఉమ్మడి జిల్లాలో వైసీపీకి స్థానం లేకుండా పోవడం, కూటమి పూర్తిగా చేజిక్కించుకోవడంతో నామినేటెడ్ పోస్టులన్నీ కూటమి పరం కాబోతున్నాయి. అధికారంలో ఏ ప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వమే నేరుగా ఆయా నియోజకవర్గాల్లో నామినే టెడ్ చేసే అధికారం ఉంటుంది. ఇప్పుడు ఏకపక్షంగా కూటమి అధికారంలోకి రావడంతో వివిధ నామినేటెడ్ పోస్టుల్లో ఇంతకు ముందు అడ్డదారిన వచ్చే సిఫార్సుల మేరకే కొంత మందిని నియమించినా ఇప్పుడు ఆ తరహా తప్పులేమి జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ అరాచకానికి, అక్రమ కేసులకు, ఒత్తిళ్ళకులోనైన వారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుం టున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ గెలుపునకు కారణ మైన కొంత మందికి ఏదో ఒక నామినేటెడ్ పోస్టు ఇప్పించేలా చూస్తానని భరోసా ఇచ్చినందున వారి విషయాన్ని తొలుత పరిగణలోకి తీసుకోబోతున్నారు.

- **మార్కెట్ కమిటీలకు పోటీ**

నియోజవకర్గాల్లో ఎమ్మెల్యేతోపాటు పూర్తి ప్రొటోకాల్ పరిధిలోకి వచ్చేది మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లే. వ్యవసా య మార్కెట్ కమిటీ ఛైర్మన్ అయ్యేందుకు ఆ మేరకు నామినేటెడ్ దక్కించుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే సిఫా ర్సులే కీలకంగా ఉండేవి. కాని, కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే సిఫార్సులకు విలువ ఇస్తూనే పార్టీలో కష్టించి పనిచేసిన సాధారణ కార్యకర్తలకూ తగిన ఛాన్స్ ఇవ్వాలని భావిస్తున్నారు. దీనికి తగ్గట్లు క్షేత్రస్థాయిలో ఎవరె వరు ఏ ఏ స్థాయిల్లో కష్టపడింది ? జాబితాలు తయా రవుతున్నాయి. కీలక మార్కెట్ యార్డుల్లో ఛైర్మన్‌లుగా వున్న వారిలో కొంత మంది రాజీనామాలకు సిద్ధపడి ఆ పోస్టులను ఖాళీ చేస్తున్నారు. రాబోయే మూడు నెల ల కాలంలోనే ఈ పదవులన్నింటిని భర్తీ చేసే అవకా శాలు ఉన్నాయి.


అన్న క్యాంటీన్ వద్ద భోజనం కోసం క్యూలో జనం... లోపల భోజనం చేస్తున్న దృశ్యం (ఫైల్)

▪ తెరుచుకోనున్న అన్న క్యాంటీన్‌లు

టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్నార్తుల ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్‌లను మరల తెరుస్తామని టీడీపీ ప్రకటించడంతో నిరుపేదల్లో హర్షం వ్యక్తమవుతోంది. గతంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం నిరుపేద ప్రజల ఆకలి కష్టాలను తొలగించేందుకు రాష్ట్రవ్యాప్తంగా రూ.5లకే అక్షయపాత్ర సహకారంతో నాణ్యమైన భోజనం, రూ.5లకే అల్పాహారం అందించింది. ఏలూరు నగరంలో అప్పట్లో ఏడు అన్న క్యాంటీన్‌లు ప్రారంభించారు. కార్మికులు, రిక్షా పుల్లర్లు, రోజువారీ కూలీలు, యాచకులు, వృద్ధులు, వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చిన వారికి ఈ క్యాంటీన్లు ఆకలి తీర్చేవి. వైసీపీ అధికారంలోకి రావడంతో క్యాంటీన్‌లు మూసివేసి సచివాలయ భవనాలుగా మార్చి పేదల నోటికి ముద్ద అందకుండా చేశారు. ప్రస్తుతం ఏలూరులో భోజనం రూ.80ల నుంచి రూ.100, అల్పాహారం రూ.50 ఖర్చు చేయాలి. గతంలో అన్న క్యాంటీన్లలో కేవలం రూ.5లకే నాణ్యమైన భోజనం చేసేవారు. వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లు మూసివేసి మా పొట్టకొట్టిందని పలువురు రిక్షాపుల్లర్లు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ రాకతో అన్న క్యాంటీన్‌లకు పూర్వవైభవం వస్తుందని, మా కడుపు నిండుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- ఏలూరు రూరల్


ప్రస్తుతం సచివాలయంగా మారిన నగరంలోని ఓ అన్న క్యాంటీన్

- కొల్లేరులో దెబ్బతింటున్న భూగర్భ జలాలు
- సరస్సులో 12 శాతానికి ఉప్పు నీటి సాంద్రత



ఉప్పు నీటి సరస్సు

కైకలూరు, జూన్ 8: ప్రపంచంలోనే అతిపెద్ద మంచినీటి సరస్సు కొల్లేరు ఉప్పు నీటి కాసారంగా మారింది. ఏటా వర్షాకాలం పుష్కలంగా నీరున్నప్పటికీ నీటి నిల్వలకు ఎలాంటి ప్రణాళిక లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రోజూ సముద్రపు నీరు పోటు ద్వారా ఉప్పుటేరు నుంచి కొల్లేరులోకి చేరడంతో సహజ సిద్ధంగా పెరిగే మత్స్యసంపద, జీవ రాశులు మృత్యువాత పడుతున్నాయి. ఈ క్రమంలో వేలాది మంది మత్స్యకారులు సైతం తమ ఉపాధిని కోల్పోతున్నారు.

ఉప్పు సాంద్రత

ఏటా వర్షాకాలంలో పది వేల క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి కొల్లేరులోకి చేరుతుంది. ఈ నీటిని నిల్వ ఉంచేందుకు రెగ్యులేటర్ లేకపోవడంతో పోటుకు సముద్రపు నీరు కొల్లేరులోకి చొచ్చుకొస్తోంది. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండడంతో ఉప్పుటేరులో నీటి ఉప్పు 12 శాతం చేరుకుంది. ఇంత పెద్ద శాతం ఉప్పు ఉండడంతో ఎలాంటి మత్స్యసంపదైనా గుర్రపు డెక్క, తూడు చనిపోతుంది. అనధికారికంగా కొల్లేరులో సాగు చేస్తున్న రొయ్యల చెరువులు, అనేక గ్రామాల్లో రొయ్యల సాగు ఉప్పు నీటిలోనే చేస్తుండడంతో కొల్లేరులోనే కాక ఈ ప్రాంత నేలలు ఉప్పు నీటి కయ్యలుగా మారాయి. గతంలో ఊట బావులు తీసినా, బోర్లు వేసినా 20 నుంచి 30 అడుగులు లోతులో తీపి నీరు వచ్చేది. ప్రస్తుతం భూగర్భ జలాలు ఉప్పుమయంగా మారడంతో 100 అడుగుల లోతు భూమి లోపలకి వెళ్లినా ఉప్పు నీరే వస్తోంది. ఆక్వాలో రొయ్యల సాగుకు ఉప్పు నీరు అనుకూలంగా ఉన్నప్పటికీ చేపల పరిశ్రమకు తీరని దెబ్బ. ఉప్పు టేరు పరీవాహక ప్రాంతమైన కైకలూరు, కలిదిండి, కృష్ణా జిల్లా బంటుమిల్లి, కృత్తివెన్ను, పశ్చిమగోదావరి జిల్లా కాళ్ళ, ఆకివీడు తదితర మండలాల్లో రెండు లక్షల ఎకరాలకుపైగా చేపల సాగు జరుగుతోంది. ఎగువ నుంచి నీరు కాల్వల ద్వారా అందకపోతే ఉప్పుటేరు పరీవాహక ప్రాంతంలోని రైతులంతా ఈ ఏరులోని నీటినే చేపలకు నింపుకుంటుంటారు. ఏటా భారీగా వర్షాలు కురిస్తే ఉప్పుటేరులోకి జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే ఉప్పు నీరు చేరుతుంది. ఇలా చేరే నీటిలో మే నెల దాటే సరికి ఉప్పు సాంద్రత పది శాతం నమోదవుతోంది. దీంతో చేపల పరిశ్రమకు ఏ విధంగానూ ఈ నీరు ఉపయోగపడడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పక్షులు, పశువులకు తాగు నీరు కరువు

కొల్లేరు ఉప్పు నీటి సరస్సుగా మారడంతో పక్షులకు, పశువులకు తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాయి. రైతులు తమ పశువులను కాపాడేందుకు దూర ప్రాంతాల నుంచి మంచినీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. దేశ విదేశాల నుంచి వచ్చే వలస పక్షులు సైతం ఈ ఉప్పునీరు వల్ల సరైన ఆహారం దొరక్క విలవిలలాడుతున్నాయి. సరస్సులోకి ఉప్పు నీరు రావడం వల్ల అనేక రకాల చేపలు కనుమరుగయ్యాయి. తెల్ల, నల్లజాతి చేపలు సైతం ఉప్పు నీటి దెబ్బకు అంతరించిపోతున్నాయి. ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మాణం చేస్తే వేసవిలో ఉప్పు నీరు వచ్చే సమయంలో సరస్సులోకి చేరకుండా అడ్డుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

నెరవేరనున్న కలల సౌధం

హౌసింగ్ ఫర్ ఆల్ స్కీమ్‌లో భాగంగా పీఎంఏవై, ఎన్టీఆర్ కాలనీ లబ్ధిదారుల కలలకు మోక్షం కలగనుంది. దాదాపు ఆరేళ్ల నిరీక్షణ అనంతరం త్వరలో సొంత ఇళ్ళల్లోకి గృహ ప్రవేశాలు చేస్తామనే ఆశను జీ+3 లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో చేపట్టిన ఈ భవనాలను పూర్తి చేయకుండా వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది.

- ఆరునెలల్లో లబ్ధిదారుల చెంతకు జీ+3 భవనాలు..
- భవనాల పూర్తికి చర్యలు ప్రారంభం
- వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన వైనం

(నూజివీడు/నూజివీడు టౌన్):

నూజివీడు మునిసిపల్ పరిధిలో పీఎంఏవై, ఎన్టీఆర్ కాలనీల్లో భాగంగా నివాస గృహాలు లేని వారికి 4,030 గృహాలను గతంలో తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసింది. బాలారిష్టాలు పూర్తి చేసుకుని 2,600 గృహాలు 80 శాతం పూర్తయి లబ్ధిదారులకు కేటాయింపు జరిగింది. అయితే అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జీ+3 భవన నిర్మాణాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయింది. భవనాలు లబ్ధిదారులకు అందితే ఎక్కడ తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకు మంచిపేరు వస్తుందనే ఆలోచనతో ఐదేళ్ల పాటు భవన నిర్మాణాలను అడుగు ముందుకు వేయనీయకుండా వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో నిర్మాణాలను నిలిపివేసింది. స్థానికంగా ఆందోళనకర వాతావరణం ఏర్పడడంతో, నాటి స్థానిక వైసీపీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఒక్కసారి నివాస భవనాల పత్రం మంజూరు, మరోసారి పట్టా, అనంతరం రుణ మంజూరు అంటూ కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారులను మభ్యపెట్టి పీఎంఏవై, ఎన్టీఆర్ కాలనీ లబ్ధిదారులను పీకల్లోతు అప్పుల ఊబిలోకి నెట్టివేశారు. ఇటీవల రుణాలను చెల్లించాల్సిందిగా బ్యాంకర్ల నుంచి ఒత్తిడి రావడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో లబ్ధిదారులు ఉండిపోయారు. ఎన్నికలు సమీపించిన తరుణంలోనూ రహదారుల నిర్మాణం చేపట్టాం. పాత భవనాలకే కొత్తరంగులు వేసి, భవనాలు పూర్తయ్యాయంటూ భవన నిర్మాణాలను 2023, జనవరి మాసాంతం లోపు అందిస్తామంటూ చెప్పిన మాటలు నీటిమూటలే అయ్యాయి. దీంతో ఓటే ఆయుధంగా లబ్ధిదారులు సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసీపీకి సమాధానం చెప్పారు. ఎప్పుడు నూజివీడు మునిసిపాలిటీకి మెజార్టీ వచ్చే వైసీపీకి ఈసారి 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా 4,700 ఓట్లు మైనస్ ఇచ్చి అధికార పార్టీకి లబ్ధిదారులు, పట్టణ ప్రజలు చుక్కలు చూపించారు. తెలుగుదేశం ప్రభుత్వం కొలువు తీరుతున్న నేపథ్యంలో తమ నివాస గృహాలు త్వరలో అందుతాయనే ఆశను వెల్లిబుచ్చుతున్నారు. ఇటు ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణం భవన నిర్మాణాలను వేగవంతం చేసి ఆరునెలల్లో లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ పెద్దలు, స్థానిక ఎమ్మెల్యేగా ఎన్నికైన పార్థసారథి సైతం చర్యలు వేగవంతం చేస్తున్నారు.

మూడు విభాగాలుగా జీ+3 భవనాలు

పీఎంఏవై, ఎన్టీఆర్ కాలనీలో భాగంగా నిర్మాణం చేపట్టిన జీ+3 భవన నిర్మాణాలు మూడు విభాగాలుగా విభజిస్తూ నాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 'ఏ' కేటగిరిలో రూ.500 లబ్ధిదారుని వాటాతో 300 చదరపు అడుగుల నివాస గృహాన్ని, 'బి' కేటగిరిలో రూ.50 వేల లబ్ధిదారుని వాటాతో 350 చదరపు అడుగుల భవనాన్ని, 'సీ' కేటగిరిలో లక్ష రూపాయలు లబ్ధిదారుని వాటాతో 430 చదరపు అడుగుల డబుల్ బెడ్‌రూమ్ నివాస గృహాన్ని ఇచ్చేందుకు నిర్ణయించారు. 'ఏ' కేటగిరిలో భవనాలను ఉచితంగా లబ్ధిదారులకు ఇవ్వగా, బీ,సీ కేటగిరి వారు సబ్సిడీ పోనూ మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల నుంచి రుణాన్ని పొంది చెల్లించాల్సి ఉంది.


నేటికి పూర్తికాని జీ+3 భవనాలు

అప్పుల ఊబిలో లబ్ధిదారులు..

వైసీపీ ప్రభుత్వం జీ+3 లబ్ధిదారుల నుంచి వాటా ధనంగా బ్యాంకు రుణాల రూపంలో రూ.40 కోట్లు వసూలు చేసి ప్రభుత్వ ఖాతాకు జమ చేసుకుంది. 'బీ' కేటగిరిలో 864 మంది, సీ కేటగిరిలో 912 మంది లబ్ధిదారుల నుంచి రుణాల సేకరణకు దరఖాస్తులు చేయించి ప్రతి ఒక్కరి నుంచి సుమారు మూడున్నర లక్షల వరకు లబ్ధిదారులచే బ్యాంకర్ల నుంచి రుణాలు పొంది, ప్రభుత్వ ఖాతాకు జమ చేసుకుంది. రెండేళ్లలో భవననిర్మాణాలను పూర్తిచేస్తామని, హామీ ఇచ్చి సదరు రుణాలపై మారిటోరియంను సైతం విధించింది. ఫలితంగా రుణం పొందిన అసలు మొత్తానికి వడ్డీతో కలిపి మొత్తానికి లబ్ధిదారులు రుణవాయిదాలు చెల్లించాల్సిన పరిస్థితి ఎదురైంది. భవనాలు పూర్తిచేసి అందిస్తామన్న హామీ మాత్రం నెరవేరలేదు కాని ఇటు లబ్ధిదారులు మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అంతేకాక ఇతర రుణాలు సైతం పొందేందుకు అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ తప్పిదానికి లబ్ధిదారులు బాధితులుగా మారిన పరిస్థితుల్లో నూతనంగా ఏర్పడుతున్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం తమను రుణబాధల నుంచి విముక్తి కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

- **నాడు అడ్డు పడకుండా ఉంటే..**

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో పీఎంఏవై ఎన్టీఆర్ కాలనీ శంకుస్థాపన సమయంలో నాటి వైసీపీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఎమ్మార్ అప్పారావు కాలనీలో జీ+3 భవననిర్మాణాలు చేయటానికి వీల్లేదంటూ నూజివీడు - తిరువూరు ప్రధాన రహదారిపై బైఠాయించి శంకుస్థాపన కార్యక్రమాలను అడ్డుకున్నారు. అనంతరం ఈ విషయమై పలుమార్లు అనేక వివాదాలను సైతం సృష్టించారు. వాస్తు సక్రమంగా లేదని, భవన నిర్మాణాల నాణ్యత అంతగా లేదని, ప్రచారం చేయడంతో, ఇటు లబ్ధిదారులు తమ వాటా ధనాన్ని చెల్లించేందుకు తటపటాయించాల్సిన పరిస్థితిని సృష్టించారు. దీంతో నాటి నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు జీ+3 నిర్మాణాలపై విస్తృత ప్రచారం నిర్వహించి, లబ్ధిదారుల వాటాను చెల్లించేందుకు కృషి చేశారు. చివరి రెండేళ్లలో భవన నిర్మాణాలు ప్రారంభమై వేగవంతమై సుమారు 80 శాతం భవనాలు పూర్తయ్యే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చి భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. అదే నాడు ఎమ్మెల్యేగా ఉన్న ఎమ్మెల్యే ప్రతాప్, జీ+3 భవన నిర్మాణాలను అడ్డుకోకపోయి ఉంటే గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే లబ్ధిదారుల సొంతింటి కల నెరవేరేది. లబ్ధిదారులకు నివాసగృహాలు అందితే ఎక్కడ తెలుగుదేశం పార్టీకి లబ్ధి చేకూరుతుందోననే కారణంతోనే నిర్మాణాలను అడ్డుకున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు పక్కన కూలిన చెట్లను తొలగించండి



చింతలపూడి, జూన్ 8: చింతలపూడి - ఏలూరు రోడ్డు పక్కన ఇటీవల వచ్చిన గాలి, వర్షానికి వెలగలపల్లి నుంచి జూబ్లీనగర్ వరకు పలుచోట్ల చెట్లు కూలిపోవడంతో మార్గంలో ప్రయాణించే వాహనదారులకు అడ్డుగా మారాయి. రాత్రివేళ దగ్గరకు వచ్చే వరకు పడిన చెట్లు కనిపించటం లేదని, ప్రమదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. చెట్లను పక్కకు తొలగించాలని కోరుతున్నారు.

నేడు ఆయుష్ ఉచిత వైద్య శిబిరం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 8 : ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలోని కత్తేపు వీధి జామియా మసీదులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్ టెస్టులతో పాటు, అవసరమైన వారికి ఈసీజీ తీసి, మందులు అందజేస్తామన్నారు. వివరాలకు ఆస్పత్రి ఫోన్ నెంబరు 08812-227755లో సంప్రదించాలని కోరారు.

అప్పనవీడులో నేడు చాగంటి ప్రవచనం

పెదపాడు, జూన్ 8 : అప్పనవీడులోని అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం జరుగుతుందని ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు.

12 నుంచి ఏసీ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ

ఏలూరు టూ టౌన్, జూన్ 8: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ గ్రామీణ యువతి, యువకులకు రిఫ్రిజిరేటర్, ఏసీ రిపేరింగ్‌లలో నెల రోజులు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి ఆపైన చదివి 19 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు వారికి ఈ నెల 12వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. శిక్షణకు ఎంపికైన వారికి ఉచిత భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారుసెల్ నెంబర్ 95027 23561లో సంప్రదించాలన్నారు.

చెరువు పోరంబోకు స్థలం ఆక్రమణకు యత్నం

పెదపాడు, జూన్ 8 : పెదపాడు-నాయుడుగూడెం ప్రధాన రహదారిలో ఐషర్ పెట్రోల్ బంక్ సమీపంలో ప్రభుత్వ స్థలంలోని చెరువు పోరంబోకు స్థలాన్ని కొందరు మట్టితో పూడ్చి ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో రెవెన్యూ అధికారులు శనివారం అడ్డుకున్నారు. రహదారికి పక్కనే సుమారు 25.30 సెంట్ల విలువైన చెరువు పోరంబోకును ఆక్రమించేందుకు యత్నించడంతో అడ్డుకుని రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేసినట్లుగా గ్రామ రెవెన్యూ అధికారి నటరాజన్ దాస్ చెప్పారు. సీజ్ చేసిన యంత్రాలను పెదపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి, తగు చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు తెలియజేసి, తహసీల్దారు ఆదేశాల మేరకు పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేశామని వీఆర్వో చెప్పారు.

వ్యాధులు ప్రబల కుండా చూడాలి

జీలుగుమిల్లి, జూన్ 8 : వర్షాకాలంలో ప్రజలు వ్యాధులబారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి నాగేశ్వరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి గాయత్రితో శనివారం పలు అంశాలపై చర్చించారు.

విద్యార్థుల అపూర్వ కలయిక

పోలవరం, జూన్ 8 : గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000 -2001 లో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం పట్టిసీమ కమలా నరసింహ నిలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు ఇబ్రహీం, బాల, కల్పవల్లి, సుజాత, స్వాతి, లలిత, షకీలా, పద్మ గఫ్లాపోశ్, ఫణి, గౌషియా తదితరులు పాల్గొన్నారు.

థైరాయిడ్ యంత్రాన్ని వినియోగంలోకి తేవాలి

ఏలూరు టూ టౌన్, జూన్ 8: ప్రభుత్వాసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న థైరాయిడ్ యంత్రాన్ని వినియోగంలోకి తేవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సోమయ్య డిమాండ్ చేశారు. రూ.20 లక్షలతో కొనుగోలు చేసిన యంత్రాన్ని ఆసుపత్రి యాజమాన్యం మూలన పడవేసిందన్నారు.

విద్యార్థులకు త్రి భాష నిఘంటువుల పంపిణీ

లింగపాలెం, జూన్ 8: స్థానిక పవర్‌పేటలోని హిందీ నికేతన్ వజ్రోత్సవాల సందర్భంగా హిందీ నికేతన్‌లో హిందీ భాష కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఎస్ఆర్ పబ్లికేషన్స్ సౌజన్యంతో మాతృదేవోభవ ట్రస్ట్ నేతృత్వంలో తెలుగు, హిందీ, ఆంగ్లభాషలకు సంబంధించిన త్రి భాష నిఘంటువులను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. హిందీ నికేతన్ అధ్యక్షుడు వి.వెంకటస్వామి, మాతృదేవోభవ సంస్థ కార్యదర్శి కె.సత్యనారాయణ, పి.భాస్కరరాము, రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు కూలీ సంఘం మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ఏలూరు రూరల్, జూన్ 8: స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం సమీపంలోని టొబ్యాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఈ నెల 15,16,17 తేదీల్లో జరిగే రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు ఎస్.ఝాన్సీ, కార్యదర్శి నాగరాజు, లలిత కుమారి పిలుపునిచ్చారు. స్థానికంగా శనివారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఏఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి అరవింద్‌సిన్హా, సుబోధ మిత్ర హాజరవుతారన్నారు. అదేరోజు సాయంత్రం ఏలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 16న టొబాకో మర్చంట్స్ హాల్లో వ్యవసాయ రంగ సంక్షోభం, పాలకుల విధానాలు, మన కర్తవ్యాల పై సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీదశ్వరరావు విచ్చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహాసభలకు సంబంధించి వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ, జిల్లా అధ్యక్షుడు ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఎముకలు, కీళ్ల వైద్య శిబిరం

ఏలూరు రూరల్, జూన్ 8: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా శ్రీకృష్ణ ఆర్థో ఆసుపత్రి వైద్యులు శ్రీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఆర్థో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు బోన్‌డెన్సిటీ, ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

126 మందికి ఉచిత ఆయుర్వేద వైద్య సేవలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 8 : స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ బీవీఎం నగేష్ 126 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. బొలిశెట్టి సురేష్, పండరీనాథ్, చెన్నా వెంకట్రామయ్య తగు సేవలు అందించారు.

తూర్పుకాపు సంఘం ఆత్మీయ సత్కారం

ఏలూరు కార్పొరేషన్, జూన్ 8 : కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించిన నేపథ్యంలో శనివారం తూర్పుకాపు సంఘ నాయకులు, కార్యకర్తలు జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడును మస్తాన్ మన్యం కాలనీలోని ఆయన నివాస గృహం వద్ద కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఎటువంటి ఘర్షణలకు, వ్యక్తిగత దూషణలకు పాల్పడవద్దన్నారు. రాఘవయ్య చౌదరి, సిరిపల్లి ప్రసాద్, సంఘ నాయకులు బంక ప్రసాద్, పిన్నింటి మహేష్, లంకా రామ్మోహన్, అలగంజి శ్రీనివా స్, సరిది రాజేష్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, యుగంధర ప్రసాద్ పాల్గొన్నారు.

సొసైటీ ఛైర్మన్ల రాజీనామాలు

చింతలపూడి/టి.నరసాపురం/పెదపాడు, జూన్ 8: రాఘవాపురం సొసైటీ త్రీమెన్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఉన్న గిరిబోగారావు శనివారం తన పదవికి రాజీనామా చేసి నూజివీడు శాఖ అధికారికి పంపినట్లు తెలిపారు. జగ్గవరం సొసైటీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి మధు స్థానిక సొసైటీలో శనివారం తన రాజీనామా పత్రాన్ని సీఈవో తనగాల వీరవెంకయ్యకు అందజేశారు. పెదపాడు సొసైటీ త్రీసభ్య కమిటీ ఛైర్మన్ పదవీకి అక్కినేని రాజశేఖర్ శనివారం రాజీనామా చేసినట్లుగా సొసైటీ ముఖ్య కార్యదర్శి సుబ్బారావు తెలిపారు. ఛైర్మన్‌తో పాటు బ్యాంకు పరిధిలో మిగతా కార్యవర్గ సభ్యులు (డైరెక్టర్లు) కూడా రాజీనామాలు చేశారన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

టి.నరసాపురం, జూన్ 8: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని బంజారా బజరంగీ భేరీ సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ అన్నారు. కృష్ణాపురంలో బంజారా బజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో 10 తరగతి, ఇంటర్మీడియట్‌ల లోఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను శనివారం ఘనంగా సన్మానించి విద్యార్థులకు చేతక్ మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. బంజారా బజరంగీ భేరీ, సంఘం ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్, ఉపాధ్యాయ సంఘం నాయకులు కృష్ణప్రసాద్, తదతరులు పాల్గొన్నారు.



ఏలూరులో ఎమ్మెల్యే చంటి నివాళి



ఉంగుటూరులో ఎమ్మెల్యే ధర్మరాజు నివాళి



జీలుగుమిల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో



కామవరపుకోటలో మాజీ ఎమ్మెల్యే ఘంటా నివాళి



భీమడోలులో గన్ని నివాళి

పత్రికా రంగానికి తీరని లోటు

ఈనాడు, ఈటీవీ సంస్థల అధినేత రామోజీరావు మృతికి పలువురి సంతాపం

ఏలూరు టూ టౌన్, జూన్ 8: రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో రామోజీరావు సంతాప సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : రామోజీరావు మృతికి ఏపీయూడబ్ల్యూజే ఏలూరు జిల్లా అధ్యక్షుడు కేవీకే కిషోర్, బీజేయూ నాయకులు జీవీఎస్ఎన్ రాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు మాణిక్యరావు, రఘురామ్, సామ్న రాష్ట్ర నాయకులు బీవీ రామారావు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.

● ఉంగుటూరు :పాత్రికేయ వృత్తిని సామాన్యులకు రుచి చూపించిన వ్యక్తి రామోజీరావు అని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనశ్రేణులు పాల్గొన్నారు.

● పెదవేగి : రామోజీరావు మృతితో జర్నలిజంలో ఒక అధ్యాయం ముగిసిందని, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. రామోజీరావు ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరంజీవిగానే మిగులుతారని ప్రభాకర్ పేర్కొన్నారు. అలాగే పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు రామోజీరావు మృతికి సంతాపం తెలిపి, నివాళులర్పించారు.

● కామవరపుకోట : మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు సంతాప సూచికంగా నల్లబ్యాడ్జీలతో ప్రదర్శన జరిపారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద శనివారం రామోజీరావు మృతికి టీడీపీ శ్రేణులు సంతాప సభ నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, టీడీపీ నాయకులు పసుమర్తి పార్థసారధి బాబు, కంఠమనేని అంజిమూర్తి, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, ఘంటా వీర వెంకటేశ్వరరావు, పెట్రోలు బాజీ తదితరులు ఉన్నారు.

● భీమడోలు : రామోజీరావు మృతి తనను దిగ్ర్భాంతికి గురిచేసిందని ఏలూరు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులోని ఆయన క్యాంపు కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. పలువురు పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

● రామోజీరావు మృతి తీరని లోటని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నేతర అజయ్‌బాబు, ఏపీ సమాచార హక్కు సంఘం అధ్యక్షులు మురళీ గొల్లపల్లి, ఏపీ రాష్ట్ర జిల్లా గ్రంథాలయాల సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.రాంబాబు, బాబ్జీ అన్నారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● పోలవరం : స్థానిక టీడీపీ కార్యాలయంలో రామోజీరావు మృతికి టీడీపీ శ్రేణులు సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బొరగం శ్రీనివాసులు, సీనియర్ నాయకులు కుంచే దొరబాబు, బొడ్డు కృష్ణ, పాపోలు గణపతి రత్తయ్య, పెద్దేహపు వీరవెంకట సత్యనారాయణ, డోకల నాగేశ్వరరావు, మంగిన కొండ, నల్లా రాంబాబు పాల్గొన్నారు.

● జీలుగుమిలి : రామోజీరావు మృతి జర్నలిజానికి తీరని లోటని అని జీలుగుమిల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బి.ప్రసాదరెడ్డి అన్నారు. ఆయన చిత్రపటం వద్ద పలువురు జర్నలిస్టులు నివాళులర్పించారు. మండల కమిటీ సభ్యులు కె.రాము, యు.ప్రసాద్, బి.రామారావు, కె.ప్రసాద్, డి.మనోజ్, సీహెచ్ రాఘవులు, కె.సాయి, బి.సందీప్, కె.రామాంజనేయులు ఉన్నారు.

● లింగపాలెం : టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మోరంపూడి మల్లికార్జునరావు, చల్లగుళ్ల సత్యనారాయణ చౌదరి, తాతిన రాధాకృష్ణ, వలసపల్లి శ్రీను, పల్లి శ్రీను, అసిలేటి అజయ్, పామర్తి వెంకటేశ్వరరావు, గౌరీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చింతలపూడి : స్థానిక టీడీపీ కార్యాలయంలో రామోజీరావుకు ఘన నివాళులర్పించారు. మాజీ కన్వీనర్ జె.ముత్తారెడ్డి , కూటమి నాయకులు టి.చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాజారెడ్డి, మాటూరి వెంకటరామయ్య, చిట్టూరి ధర్మరాజు, బోడా నాగభూషణం, కె.శేషగిరి, చీదరాల మధుబాబు, అనిష్‌కుమార్, అప్పారావు, ప్రగడవరం గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు నివాళులర్పించారు.

● ద్వారకాతిరుమల : దొరసానిపాడు, ద్వారకాతిరుమలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రామోజీరావుకి నివాళులర్పించారు. దొరసానిపాడులో నేతలు కారుమంచి మురళి,పసుమర్తి సోమశేఖర్, మద్దిపాటి రత్నాజి రామోజీ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ద్వారకాతిరుమలలో కూరాకుల బుజ్జి, రేవూరి వెంకటేశ్వరరావు, కూన పాముల రామారావు నివాళులర్పించారు.

● టి.నరసాపురం : జగ్గవరంలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేతవరం, ఉపసర్పంచ్ భీమవరపు జగన్మోహన్‌రావు, జయ్యవరపు శ్రీనివాసరావు, లింగారెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● నిడమర్రు : మండల టీడీపీ నాయకులు రామోజీరావుకు ఘన నివాళులర్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు ముత్యాల స్వామి, మైనారిటీ సెల్ అధ్యక్షులు గప్ఫార్ ఖాన్, సత్తినీడి నాని, పాల్గొన్నారు.

● కుక్కునూరు : రామోజీరావు చిత్రపటానికి టీడీపీ శ్రేణులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మునిశెట్టి నాగేశ్వరరావు, కొటగిరి సత్యనారాయణ, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, ముప్పాల శ్రీదేవి, శివయ్య, పులి శ్రీను, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : రామోజీరావుకు టీడీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. జంగారెడ్డిగూడెం మండల పార్టీ అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు, నాయకులు చిట్టిబోయిన రామలింగేశ్వరావు, కొటారు ప్రసాద్, కుంచాడ ప్రసాద్, టి.వెంకటేశ్వరావు, బి.కిరణ్, కె.శ్రీను, వి.పోసుబాబు, ఎం.రామారావు, దాసరి బుష్ పాల్గొన్నారు.



కుక్కునూరులో టీడీపీ శ్రేణుల నివాళి



బుట్టాయగూడెంలో...



లింగపాలెంలో..



కామవరపుకోటలో....



ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో..

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఏలూరు క్రైం, జూన్ 8 : తలసేమియా చిన్నారులకు రక్త నిల్వలులేక ఇబ్బంది గురవుతున్నారని తెలుసుకున్న ఓ యువకుడు తన స్నేహితులను తీసుకువచ్చి రక్తదానం చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో ప్రతి నెలా తలసేమియా చిన్నారులకు రక్తాన్ని ఎక్కిస్తూ ఉంటారు. వేసవి దృష్ట్యా రక్త నిల్వలకు ఇబ్బందులు కలగడంతో ఈ విషయం తెలుసుకున్న కె.జాషువా అనే యువకుడు తన స్నేహితులను ప్రోత్సహించి రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డికి తెలియజేశారు. దీంతో 27 మంది యువకులు వచ్చి రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేసి తలసేమియా చిన్నారులకు రక్త కొరతను తీర్చారు. రక్తదానం చేసిన జాషువా అతని స్నేహితులను రెడ్‌క్రాస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, రెడ్‌క్రాస్ వైద్యులు డాక్టర్ ఆర్ఎస్ఆర్‌వి వరప్రసాదరావు, డాక్టర్ స్పందన, పీఆర్వో కేవీ రమణ అభినందించారు.

విద్యా సంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్

ఏలూరు టూ టౌన్, జూన్ 8: నగరంలో ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని సీపీఎం నగర కార్యదర్శి కిషోర్ డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుకుంటూ పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జీఓ ప్రకారం ఐదో తరగతి లోపు చదివే విద్యార్థులకు రూ.10 వేలు, ఆరు నుంచి పదో తరగతి వరకు రూ.15 వేలు, కళాశాలలో చదివే విద్యార్థులకు రూ.17,500లలోపు ఫీజులు వసూలు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా రెండు,మూడు రెట్లు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. విద్యాహక్కు చట్ట ప్రకారం కార్పొరేట్ విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఎక్కడా కేటాయించటం లేదన్నారు. కనీసం కళాశాల, పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు ఉండవని, స్వచ్ఛమైన మంచినీరు కూడా అందించటం లేదన్నారు. రామాంజనేయులు, సాయిబాబు, ప్రసాద్, జగన్నాధరావు, కిషోర్, అరుణకుమారి, హైమ, తదితరులు పాల్గొన్నారు

ఓపెన్ సప్లిమెంటరీ పరీక్షలకు 141 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 8 : ఓపెన్ స్కూల్స్ దూర విద్య సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన పదో తరగతి సోషల్ పరీక్షకు 226 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్ ఎకామిక్స్ పరీక్షకు 295 మంది, కెమిస్ట్రీ పరీక్షకు 346 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 141 మంది గైర్హాజర య్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ



వాహన డ్రైవర్‌తో ఫేస్‌వాష్ చేయిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూన్ 8 : జిల్లాలో నేరనియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని రాష్ట్ర, జాతీయ, ఇతర రహదారులపై శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకూ వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డు ప్రమదాల నివారణ కోసం డ్రైవర్లక ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో సారా, మద్యం అక్రమ రవాణా జరుగకుండా అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు ప్రాంతాల్లో కూడా ఈ తనిఖీలు నిర్వహించారు. ఏటీఎం, దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద, రాత్రి వేళ లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో అనుమానాస్పదంగా ఉన్నవారిని గుర్తించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు ఈ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు.

హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ

ఏలూరుటూటౌన్, జూన్ 8: నగరంలో హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించినట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామంజనేయ చౌదరి (తపనా చౌదరి) శనివారం తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రను రామకోటి వద్ద ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

భీమడోలు, జూన్ 8 : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని వినియోగదారుల చట్టం జిల్లా ఛైర్మన్ మణికంఠ అన్నారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. కార్యక్రమానికి గ్రంథపాలకుడు శ్రీనివాస్ అధ్యక్షత వహించగా తరగతుల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన 40 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. టి.ఉమా మహేశ్వరరావు, మండే సుధాకర్, సత్యనారాయణ, విజయ సారధి, తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జూన్ 8 : నాయుడుగూడెం గ్రామం వద్ద వాహన తనిఖీలు నిర్వహించి చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు తరలిస్తున్న కోళ్ల వ్యర్థాలతో కూడిన వాహనాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. వాహన, చెరువు యజమానులతో పాటుగా డ్రైవర్‌పై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మలేరియా మాసోత్సవాలు

ఉంగుటూరు, జూన్ 8 : వర్షాకాలంలో మలేరియా వంటి వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని జాగ్రత్తగా ఉండాలని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఉప వైద్యాధికారి వైవీ లక్ష్మణరావు సూచించారు. కాగుపాడు ప్రాథమిక వైద్య కేంద్రంలో శనివారం మలేరియా మాసోత్సవాలు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటికి సన్మానం



ఎమ్మెల్యే చంటిని సత్కరిస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

ఏలూరు టూ టౌన్, జూన్ 8: ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యను సత్కరించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య నాగేశ్వరరావు నాయక్ తెలిపారు. నూతన ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. జిల్లా కార్యదర్శి రాము, శ్రీనివాస్, జీ.నాగేశ్వరరావు, సత్యనారాయణ, గోపి నిర్మలకుమార్‌గౌడ్, పాల్గొన్నారు.

● కాపు సంక్షేమం సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీరాములు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యను సన్మానించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ, సివిల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్, లింగిశెట్టి శశికుమార్, వెంకటేశ్వరరావు, రామలక్ష్మణరావు, నడపన దాన భాస్కర్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే టీడీపీ లక్ష్యం



చింతమనేనిని అభినందిస్తున్న మహిళలు

పెదవేగి, జూన్ 8 : నూతన ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మహిళల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా చంద్రబాబు తొలి ప్రాధాన్యతనిస్తారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ప్రభాకర్‌ను పలు గ్రామాలకు చెందిన మహిళలు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మండుటెండను సైతం లెక్కచేయకుండా మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి ఓట్లేసి, కూటమిని గెలిపించిన తీరు అభినందనీయమన్నారు. చిలుకూరి భవానీ, పిప్పర చంటి, వేంపాటి జ్ఞానమని, షేక్ అమీర్‌బీ. కె.వరలక్ష్మి, బేబీ. ధనలక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్వోల రాష్ట్ర సదస్సు వాయిదా

ఏలూరు రూరల్, జూన్ 8: బీఆర్వోల రాష్ట్ర సదస్సు వాయిదా వేస్తున్నట్లు వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి మద్దాల బాపూజి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం విజయవాడలో తలపెట్టిన రాష్ట్ర అత్యవసర కమిటీ సమావేశం, రామోజీరావు మృతికి రెండు రోజులు సంతాప దినాలు కావడం చేత వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి సమావేశం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

మొక్కులు చెల్లించుకున్న టీడీపీ నేతలు



మొక్కులు చెల్లించుకున్న లింగంపాలెం మండలం సింగగూడెంకి చెందిన టీడీపీ నేతలు



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాన్‌వెస్లీ



పోలవరం మండలం ఎల్లండీపేటలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

ఏలూరు రూరల్, జూన్ 8: స్థానిక ఆదివారపుపేటలో ఉన్న శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయం పర్యవేక్షకులు ఇసుకపల్లి తాతారావు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటిని సత్కరించారు. బాబా చిత్రపటాన్ని అందజేసి అభినందించారు. చంటి మాట్లాడుతూ ఆలయానికి సంబంధించి ఎటు వంటి సహకారం కావాలన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బాబాభక్తులు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను శనివారం ఉండవల్లిలోని ఆయన నివాసం వద్ద రాష్ట్రీయ లోక్ జన శక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చాగంటిపాటి జాన్‌వెస్లీ మర్యాద పూర్వకంగా కలిశారు. కూటమికి ఆర్ఎల్ జేపీ ఎన్నికల్లో మద్దతు ఇచ్చింది. లోకేశ్ మంగళగిరి నుంచి భారీ మెజారిటీతో గెలుపొందడంతో ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించినట్లు జాన్‌వెస్లీ తెలిపారు. వారిని కలిసిన వారిలో శామ్యూల్, ప్రణీత్, రాము, ప్రభాకర్ ఉన్నారు.

● లింగపాలెం : ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో తెలుగుదేశం నేతలు మొక్కులు తీర్చుకున్నారు. సింగగూడెంకి చెందిన టీడీపీ నాయకులు బొంతు శ్రీనివాసరావు, బొంతు రాంబాబు, మాజీ సర్పంచ్ పంతం ప్రసాదరావు ఆధ్వర్యంలో సింగగూడెం నుంచి వలసపల్లి అడ్డరోడ్డు వద్ద వేంచేసివున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. మోరంపూడి ప్రసాద్, పామర్తి వెంకటేశ్వరరావు, సత్యానారాయణ, రమేష్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

● పోలవరం : ఎల్లండీపేటలో కూటమి నాయకులు కార్యకర్తలు శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తీన్‌మార్ వాయిద్యాలు, మేళతాళాలతో, బాణసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జనసేన గ్రామ అధ్యక్షుడు తేలె నరసింహమూర్తి, చిక్కాల శ్రీను నాయకత్వంలో 20 మందికి పైగా జనసేన నాయకులు ద్వారకాతిరుమల చినవెంకన్న సన్నిధికి పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. కూటమి నాయకులు చిర్రి బాలరాజు, పుట్టా మహేష్ యాదవ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధిస్తే కాలినడకన చినవెంకన్నను దర్శించుకుంటామని మొక్కుకున్నామని తమ మొక్కులు తీర్చుకోవడానికి పాదయాత్రగా కాలినడకన వెళుతున్నట్లు తెలిపారు. గ్రామస్తులు వారిని గ్రామ శివారు వరకూ తీన్‌మార్ వాయిద్యాలతో సాగనంపారు.

డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నరహరి ఎన్నిక



నరహరి, అధ్యక్షుడు   రమణయ్య, ప్రధాన కార్యదర్శి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 8 : డెమొ క్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కె.నరహరి ఎన్నికయ్యారు. విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోంలో శనివారం జరిగిన సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ఎన్నికలు జరిగాయి. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమణయ్యను ఎన్నుకున్నారు. నరహరి మాట్లాడుతూ జీవో 117 ఉత్తర్వులను రద్దుచేసి హైస్కూళ్ళకు గతేడాది తరలించిన ప్రాథమిక తరగతులను ప్రాథమిక పాఠశాలలకు తిరిగి తరలించాలని డిమాండ్ చేశారు.మాతృభాషలోనే ప్రాథమిక విద్యను బోదించేలా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.



కవయిత్రి మాధవీలతను సత్కరిస్తున్న దృశ్యం

కళలను, కవులను ప్రోత్సహించాలి

భీమవరం టౌన్, జూన్ 8 : సామాజిక అంశాలపై 1500లకు పైగా కవితలు రచించిన కొమ్ముల మాధవీలతకు తెలుగు భాషాభిమానుల సంఘం ఆధ్వర్యంలో పీఎస్ఎన్ బాలికల పాఠశాలలో శనివారం అభినందన సత్కారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రచయిత, తెలుగు భాష సంఘ సభ్యుడు కలిగొట్ల గోపాల శర్మ మాట్లాడుతూ మాధవీలత కవితలు సామాజిక సేవకు, దేశభక్తికి అనుగుణంగా ఉన్నాయన్నారు నిర్వాహకుడు రంగసాయి మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ కవితలను రాయడం గొప్ప విశేషమని ఆ కవితలను తెలుగు భాషాభిమానుల సంఘం ద్వారా పుస్తక రూపం చేస్తామని అన్నారు.స్కూల్ హెచ్ఎం సుధారాణి,అరసవల్లి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ సుబ్రహ్మణ్యం, తెలుగు భాషాభిమానుల సంఘం సభ్యులు సూర్యనారాయణ, ఎస్ఆర్కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కే.గిరి మాట్లాడారు.మాధవీలత మాట్లాడుతూ 12 ఏళ్లుగా కవితలు రాస్తున్నానని మొదటిగా ఈ రోజు సంఘ సేవకులు రంగసాయి సత్కరించి ప్రోత్సహిస్తున్నారన్నారు. నరహరి శెట్టి కృష్ణ, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు



గణపవరం- భీమవరం రహదారిపై రాస్తారోకో చేస్తున్న సీపీఎఫ్ ఉద్యోగులు, కార్మికులు

సీపీఎఫ్ ఉద్యోగులు, కార్మికులు రాస్తారోకో

గణపవరం, జూన్ 8: ఉద్యోగ భద్రత కల్పించాలని, నిలుపుదల చేసిన ఫ్యాక్టరీని తెరవాలని, వేతనాలు తక్షణం చెల్లించాలని తదితర డిమాండ్లతో సీపీఎఫ్ ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులు రాస్తారోకో చేశారు. శనివారం గణపవరం మండలం సరిపల్లెలోని ఫ్యాక్టరీ ఎదుట గణపవరం- భీమవరం రహదారిపై రాస్తారోకో చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న సీపీఎఫ్ రొయ్యల, మేతల తయారీ ఫ్యాక్టరీలు లాభాల బాటలో ఉన్నప్పటికి స్థానిక ఫ్యాక్టరీ మాత్రం మూసివేయడం వలన తమకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉద్యోగులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికి అన్యాయం చేస్తున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని పరిహారం చెల్లించాలని ఫ్యాక్టరీ యాజమాన్య విధానాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరుతున్నారు. అనంతరం ఫ్యాక్టరీ ఎదుట నినాదాలు చేశారు.

రేపటి నుంచి నిట్‌లో జోసా కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 8 : ఏపీ నిట్‌లో 8 కోర్సులకు గానూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 480 సీట్లు ఉన్నాయని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్‌రెడ్డి తెలిపారు. వీటిలో 50 సీట్లను రాష్ట్ర విద్యార్థులతోను, మిగిలిన సీట్లను ఇతర రాష్ట్రాల విద్యార్థులతోనూ జోసా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి జోసా కౌన్సెలింగ్ ప్రారంభం కానుందని, విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుని తమకు నచ్చిన కోర్సులకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుందన్నారు.

నీట్‌లో ప్రతిభ కనబర్చిన సాయి



మొగల్తూరు,జూన్ 8: ఇటీవల విడుదల అయిన నీట్ ఫలితాల్లో మొగల్తూరు మండల పరిషత్ ఉపాధ్యాయురాలు నిహారిక కుమారుడు కెటి షణ్ముఖ శ్రీసాయి మంచి ప్రతిభ కనబర్చాడు. ప్రవేశ పరీక్ష నీట్‌లో 720 మార్కులకు గానూ 681 మార్కులు సాధించాడు. జాతీయ స్థాయిలో 8,050 ర్యాంకు, ఓబిసి కేటగిరిలో 3,270 ర్యాంకు సాధించాడు. శ్రీసాయి తండ్రి కోళ్ళ బాస్కరరావు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపీహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ పడవల మేరీ, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, మాజీ సర్పంచ్ మామిడిశెట్టి సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ గుబ్బల నాగరాజు తదితరులు అభినందనలు తెలిపారు.

జగన్ వల్లే.. ఓడిపోయాం!





(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం దారుణ ఓటమిపై ఆ పార్టీ నేతలు పోస్టుమార్టం చేసుకుంటున్నారు. ఘోర పరాజయాన్ని చవిచూడడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. కార్యకర్తల్లో ఒకింత ధైర్యాన్ని నూరిపోసే ప్రయత్నాలు మొదలెట్టారు. ఆ దిశగా అధిష్ఠానం నుంచి సూచనలందాయి. తొలుత తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని కొందరు నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరయ్యారు. అంతర్గతంగా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి మాజీమంత్రి కొట్టు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. జగన్‌మోహన్‌రెడ్డి తప్పిదం వల్లే పార్టీ ఓడిపోయిందన్న సంకేతాలు కార్యకర్తలకు పంపారు. పార్టీకి మూలస్తంభాలైన కార్యకర్తలు, కష్టపడి పనిచేసే నాయకులు, ప్రజల నుంచి గెలుపొందిన ప్రజా ప్రతినిధులకు జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం ఇవ్వలేదని కొట్టు వ్యాఖ్యానించారు. అందరిలోనూ ఇదే రకమైన అభిప్రాయం ఉందని కుండబద్దలు కొట్టారు. మరోవైపు జగన్‌మోహన్ రెడ్డి నియమించుకున్న ఐప్యాక్ సంస్థపైనా ఘాటు వ్యాఖ్యలు చేశారు. అదొక పనికిమాలిన సంస్థగా అభివర్ణించారు. ఐఐటీలు చేశాం. పెద్ద చదువులు చదివాం అంటూ ఐప్యాక్ సంస్థ ప్రతినిధులు గొప్పలు చెప్పుకున్నారు. అంతే తప్ప స్థానిక రాజకీయ నాయకులకు విలువ లేకుండా పోయింది. నియోజకవర్గంలో అసంతృప్తి నేతలతో సమావేశాలు ఏర్పాటు చేశారంటూ ఐప్యాక్‌పై కొట్టు సత్యనారాయణ విరుచుకుపడ్డారు. వాస్తవానికి జిల్లాలోని అందరి నేతల్లోనూ ఇదే రకమైన అభిప్రాయం ఉంది. ఇప్పుడంతా జగన్‌మోహన్ రెడ్డి వైఖరి వల్లే పార్టీ మట్టికొట్టుకు పోయిందన్న వాదనలు వినిపిస్తున్నారు. అయితే జగన్‌మోహన్ రెడ్డికి మించి జిల్లాలో దందాలు నడిపిన విషయాన్ని విస్మరిస్తున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ భారీ ఓట్లతో తేడాతో వైసీపీ నేతలు ఓటమి చవిచూశారు. అందుకు తిలా పాపం తలాపిడికెడు అన్నట్టు ఓటమిలో రాష్ట్రస్థాయి నేతలనుంచి నియోజకవర్గ స్థాయి నాయకుల వరకు ఉంది.. జగన్‌మోహన్ రెడ్డిని చూసుకుని జిల్లాలో అధికార పార్టీ నాయకులు తమకు ఇక తిరుగులేదన్న ధోరణిలో ఉండిపోయారు. అధినేతను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు చేశారు. తెలుగుదేశం, జనసేన నాయకులను అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టారు. పోలీస్‌లను తమకు అనుకూలంగా విని యోగించుకున్నారు. జిల్లాలోనూ పోలీస్ పాలన కొనసాగించారు. చంద్రబాబు తాడేపల్లిగూడెంలో పర్యటిస్తే వైసీపీ శ్రేణులను కొట్టు సత్యనారాయణ ఉసిగొల్పారు. సభకు అవరోధం కల్పించేలా నల్లబెలూన్‌లు ప్రదర్శించారు. అలాగే యువగళం పాదయాత్ర సమయంలో గ్రంధి శ్రీనివాస్ తమ పార్టీ అనుచరులతో దాడి చేయించారు. తణుకులో అమరావతి పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. ఇవన్నీ జనంలో వ్యతిరేకతను పెంపొందింపచేశాయి.

కార్యకర్తలను పట్టించుకోలేదు..
నాయకులకు సముచిత స్థానం ఇవ్వలేదు..
ప్రజా ప్రతినిధులదీ ఇదే దుస్థితి
జిల్లాలో ఓటమి పాలైన అభ్యర్థుల ఆవేదన

కార్యకర్తలను విస్మరించింది ఎవరు

నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కూడా కార్యకర్తలను పెద్దగా పట్టించుకోలేదు. ఆ నెపాన్ని ఇప్పుడు పార్టీపై నెడుతున్నారు. ఆర్థిక ప్రయోజనాలన్నీ నియోజకవర్గ నేతలే పొందారు. కార్యకర్తలను పట్టించుకోలేదు. కాంట్రాక్టర్లు కూడా తమ బినామీలతో చేయించుకున్నారు. నేతల అవినీతికి అడ్డే లేకుండా పోయింది. తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, నర్సాపురం, ఆచంట నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతలపై అవినీతి మచ్చ పడింది. మరోవైపు ఆర్థికంగా నేతలు బాగుపడ్డారు. అంతకు మించి వలంటీర్లపై నాయకులు ఆశలు పెట్టుకున్నారు. కేడర్‌ను విస్మరించారు. ఇవన్నీ ఎన్నికల్లో అధికార పార్టీపై తీవ్ర ప్రభావాన్నే చూపాయి. అంతకు మించి జిల్లాలో అభివృద్ధి జరగలేదు. ప్రాజెక్టులన్నీ పడకేశాయి. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో శంకుస్థాపనలు చేసిన పనులు ఏవీ జరగలేదు. మౌలిక వసతులు లేవు. నిర్మాణ రంగం చావుదెబ్బతింది. రవాణా రంగం కుదేలైంది. వ్యాపా రాలు పతనమయ్యాయి. ఇవన్నీ విస్మరించారు, కేవలం సంక్షేమ పథకాలు అంటూ అధికార పార్టీ నేతలు ఊదరగొట్టారు.అవే తమను గెలిపిస్తాయని ధీమా ప్రదర్శించారు. వలంటీర్లే లేకపోతే ఎన్నికలు లేవన్న దుస్థితికి నేతలు చేరారు. తీరా ఓటమి చెందిన తర్వాత తప్పంతా జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఓటమిపై ఆత్మస్తుతి పరనింద అన్న ధోరణిలో జిల్లాలోని వైసీపీ నేతల వ్యవహారం ఉంది. మొత్తంపైన ఓటమి బాధల నుంచి తప్పుకోవడానికి తమ అధినేతపైనే నిష్టూరాలాడుతున్నారు.

భక్తజన సంద్రం..శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, జూన్ 8: ద్వారకాతిరుమల క్షేత్రం శనివారం గోవిందా.. గోవిందా.. అంటూ భక్తుల నామస్మరణతో పులకించింది. శ్రీవారి క్షేత్రం భక్తజన సంద్రమైంది. నెలపొడుపు కావడంతో భక్తులు పోటెత్తారు. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో నిండిపోయాయి. గంటల తరబడి దాదాపు 3 గంటల సమయం శ్రీవారి ఉచిత దర్శనానికి పట్టింది. వాహనాలు అధికంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

రికార్డుస్థాయిలో నిత్యార్జిత కల్యాణాలు

శ్రీవారి నిత్యకల్యాణమండప ఆవరణలో శనివారం రికార్డు స్థాయిలో నిత్యార్జిత కల్యాణాలు జరిగాయి. వేసవిసెలవులు పూర్తి కావస్తుండటంతో అధిక సంఖ్యలో 208 జంటలు పూజల్లో పాల్గొన్నారు. స్వామి అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక అలంకారాలు చేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఘనంగా కల్యాణం నిర్వహించారు.



శ్రీవారి క్షేత్రంలో అనివేటి మండప ప్రాంతంలో భక్తుల రద్దీ



నిత్యార్జిత కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు..పాల్గొన్న భక్తులు



గ్రామోత్సవానికి బయలు దేరుతున్న అమ్మవారు

వైభవంగా ప్రారంభమైన మావుళ్ళమ్మ జ్యేష్టమాస జాతర

భీమవరం టౌన్, జూన్ 8 : పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ జ్యేష్టమాస జాతర మహోత్సవాలు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారి గరగలను ఉంచి ఆలయ ప్రధానర్చాకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ పూజలు చేశారు. పుట్టింటి వారి తరపున అల్లూరి వారి కుటుంబ సభ్యులు, అత్తింటి వారి తరుపున మెంటే వారి కుటుంబసభ్యులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, వేద మంత్రాలతో అమ్మవారి గరగలను మోటపల్లివారివీధిలో ఉన్న గరగల గుడికి తీసుకువెళ్ళారు. పొట్టి శ్రీరాములు విగ్రహం, నరసాపురం-భీమవరం రోడ్డు, భీమేశ్వరస్వామి ఆలయం వీధి మీదుగా గరగల గుడి వద్దకు తీసుకువచ్చి అందులో ఉంచారు. ఇక నుంచి ప్రతీరోజు ఇక్కడ కూడా పూజలు నిర్వహిస్తారు.

ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడిగా కోమట్లపల్లి సుబ్బారావు



ఉండ్రాజవరం, జూన్ 8: ఉండ్రాజవరం మండలం కాల్దరి గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు, పౌల్ట్రీ వ్యాపారి కోమట్లపల్లి వెంకట సుబ్బారావు శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన ఇంతవరకు ఫెడరేషన్ వైస్ ఛైర్మన్‌గా పనిచేశారు. సుబ్బారావు మాట్లాడుతూ కోళ్ల పరిశ్రమ ప్రస్తుతం ఒడిదుడుకులతో నడుస్తోందని, రైతులు సమస్యలు, నష్టాలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. సమస్యలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, కోళ్ల పరిశ్రమ యజమానులు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, కుడప చక్రపాణి, మల్లిన శ్రీనివాసరావు, బూరుగుపల్లి రాంబాబు, బూరుగుపల్లి వెంగళరావు, బూరుగుపల్లి శ్రీనివాసరావు, అభినందనలు తెలిపారు.



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొని ఆటలు ఆడుతున్న విద్యార్థులు

వేసవి శిబిరంలో చిన్నారులకు పోటీలు

పాలకొల్లు, జూన్ 8 : పాలకొల్లు బోళ్ళవారి తోట ప్రాంతంలో గల ఒహెల్ హ-సింహ సంస్థ ఆధ్వర్యంలో చిల్డ్రన్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికి నీతి శాస్త్రం, ప్రాచీన సంప్రదాయాలు, శానిటేషన్ వంటి వాటితో పాటు పలు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. శనివారం నిర్వహించిన వివిధ పోటీలలో, విజేతలకు బహుమతులను సంస్థ సీనియర్ వలంటీర్ ఆకుల కృపాదేవి అందించారు. సైన్స్ మూవీ ప్రదర్శన, నాగరికతపైన, విజ్ఞాన దాయకమైన పలు అంశాలను ఈ శిబిరంలో బోధించారు. సంస్థ ప్రతినిధులు నిత్యజీవ్ మాట్లాడుతూ ఈ శిబిరం ఈనెల 10వ తేదీతో పూర్తి అవుతుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ముదినేపల్లి రూరల్, జూన్ 8: రొయ్యల చెరువులో పట్టుబడుకి వెళ్ళిన కూలీ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ముదినేపల్లి మండలం ప్రొద్దువాక గ్రామానికి చెందిన లాలా దుర్గాప్రసాద్ (32) శనివారం అదే గ్రామానికి చెందిన రైతు చెరువులో రొయ్యలు పట్టుబడికి వెళ్ళాడు. చెరువు అడుగున ఉన్న బురద నీటిని మోటారుతో తోడుతూ మోటారు జరిపే యత్నంలో దుర్గాప్రసాద్ విద్యుదాఘాతానికి గురయ్యాడు.సహచర కూలీలు గమనించి దుర్గాప్రసాద్‌ను హుటాహుటిన కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకట్ కుమార్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజీనామా చేస్తారా ?

ఉత్తర్వులు వచ్చేవరకు వేచి చూస్తారా ?

చర్చనీయాంశంగా అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు



అన్నవరం, జూన్ 8: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో పాలకమండలి సభ్యులు కొనసాగింపు రత్నగిరిపై చర్చనీయాంశంగా మారింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి ప్రభుత్వాలు తమ నాయకుల సిఫారసుతో వారి అనుచరులకు పాలకమండలి సభ్యులుగా నియమింపబడతారు. గత ప్రభుత్వంలో రెండు పర్యాయాలు పాలకమండలి నియమింపబడగా ప్రస్తుతం ఉన్న పాలకమండలి 2023 ఫిబ్రవరి 9న ప్రమాణస్వీకారం చేయగా వారికి 2025 ఫిబ్రవరి 8తో గడువు ముగుయనుంది. అయితే ప్రభుత్వం మారడంతో పలుచోట్ల నామినేటడ్ పదవులకు కొందరు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తుండగా అన్నవరం దేవస్థానంలో సభ్యులు మాత్రం స్వచ్ఛందంగా తప్పుకుంటారా లేక ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చేవరకు వేచిచూస్తారా అనేది తేలాల్సిఉంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరక ముందే సీఎంవో కార్యాలయం నామినేటడ్ పోస్టులను రద్దు చేస్తున్నట్లు ఇప్పటికే ఉత్తర్వులు వెలువరించగా ఆదేశాలు సంబంధింత కార్యాలయాలకు చేరలేదు. ప్రస్తుతం ఉన్న పాలకమండలిలో ఛైర్మన్, ఐ.వి రోహిత్ వంశపారంపర్య ధర్మకర్తగా, ప్రధానార్చకులు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కొనసాగుతున్నారు. వీరిద్దరు మినహా ఉత్తర్వులు వెలువడితే 14 మంది సభ్యులు రాజీనామాలు చేయాల్సిందే. దేవస్థానంలో పాలకమండలి సభ్యులు ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై దృష్టి సారించాల్సి ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా కేవలం తమ తమ అనుచరగణంకి దర్శనాలు, సత్రం గదుల కేటాయించలేదంటూ సమావేశపు హాలులో చర్చించడంతో అప్పట్లో పలు విమర్శలు వచ్చాయి. నూతన ప్రభుత్వంలో కొత్త పాలకమండలిలో చోటు దక్కించుకునేందుకు ఇప్పటికే కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. టీడీపీ హయాంలో పాలకమండలి సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ జారీచేసి దరఖాస్తులు ఆహ్వానించేవారు. పోలీస్‌స్టేషన్‌లలో ఆయా ఆశావాహులపై ఎటువంటి క్రిమినల్ కేసులు ఉన్నా వారి పేర్లను నిర్మొహమాటంగా తొలగించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి నోటిఫికేషన్స్, విచారణలు లేకుండానే నేరుగా సభ్యులను నియమిస్తూ జీవోను జారీచేశారు. పాలకమండలి నియామకంలో తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల నుంచి ఇద్దరు, జగ్గంపేట, కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం నియోజకవర్గాల నుంచి ఒకొక్కరూ ఇతర ప్రాంతాల్లో పట్టున్న ఎమ్మెల్యేలు తమ అనుచరులకు పాలకమండలిలో సభ్యత్వం ఇప్పించేవారు. త్వరలో కొలువుదీరే పాలక మండలిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ప్రాధాన్యం కల్పించాల్సి ఉండడంతో కూర్పు ఏ విధంగా ఉంటుందో వేచిచూడాలి.

కాలినడకన ద్వారకా తిరుమలకు...

చాట్రాయి, జూన్ 8: నూజివీడు ఎమ్మెల్యేగా పార్థసారథి, ఏలూరు ఎంపీగా మహేష్ యాదవ్, సీఎంగా చంద్రబాబు గెలుపొంది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే కాలినడకన ద్వారకా తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తామని మండలంలోని కొత్తగూడెం గ్రామ టీడీపీ కార్యకర్తలు మొక్కుకున్నారు. శనివారం సుమారు 100 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గోవింద నామస్మరణ చేసుకుంటూ కాలినడకన ద్వారకా తిరుమల బయలుదేరి వెళ్ళారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.38.36 లక్షలు



వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు

ఆత్రేయపురం, జూన్ 8: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనం పొటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్య లక్ష్మీహోమం,బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలంరించాయి. మండపేట ఎమ్మెల్యేవిజేత వేగుళ్ళ జోగేశ్వరరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.38.36 లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

మామిడికి భలే గిరాకీ

టన్ను రూ.40 వేలు



తుని రూరల్, జూన్ 8: మెట్టలో అధికంగా ఉద్యానవన పంటగా సాగు అవుతున్న మామిడికి ఈ ఏడాది మంచి గిరాకీ ఏర్పడింది. మెట్టలో ప్రధాన మార్కెట్‌లో నాణ్యతను బట్టి టన్ను రూ.35 వేలు నుంచి రూ. 40 వేల వరకు భంగినపల్లి మామిడి అమ్ముడు అవుతోంది. ఆశించిన మేర మార్కెట్‌లోకి కాయలు రాకపోవడంతో రాజస్థాన్, యూపీ, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు పోటీ పడికొనుగోలు చేస్తున్నారు. నాలుగు రోజులు క్రితం మార్కెట్ దిగువ రేట్లకు ఉన్నప్పటికీ శుక్ర, శనివారం తుని మార్కెట్లో మామిడికి ఒక్కసారిగా రేటు పెరిగింది.ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా 10 శాతం పంట దిగుబడి రాలేదు. దీంతో ఉన్న పంటకు మంచిగిరాకీ ఏర్పడినట్లు మెట్ట రైతులు తెలుపుతున్నారు.గత ఏడాది భంగినపల్లి కాయకులు టన్నుకు గరిష్టంగా రూ. 10 వేలు నుంచి రూ.15 వేలు ధర మాత్రమే వచ్చింది. ఈ ఏడాది రేట్లు 3 రెట్లు ధర పెరిగినా దిగుబడి లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్

బలుసుమూడిలో చోరీ

భీమవరం క్రైం, జూన్ 8 : భీమవరం రెండో పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దొంగలు బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు దోచుకున్నారని టూటౌన్ సీఐ శ్రీనివాస్ శనివారం తెలిపారు. బలుసుమూడిలోని సున్నం ఆంజనేయులు అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న పావరపల్లి మాలతి ఈనెల 1వ తేదీన తన కుమారుడిని ఇంజనీరింగ్ కళాశాలలో చేర్పించడానికి ఇంటికి తాళం వేసి హైద్రాబాద్ వెళ్లారు. ఆమె ఈనెల 6వ తేదీన తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలుగొట్టి ఇంటి బీరువాలోని 144 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు దోచుకున్నారు. బాధితురాలు మాలతి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాల్వలో పడి కూలీ మృతి

మొగల్తూరు, జూన్ 8: కూలిపనికి వెళ్ళిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందినట్టు ఎస్ఐ కె.వెంకట రమణ తెలిపారు. మొగల్తూరు వెలిదివారివీధికి చెందిన వెలిది పాపయ్య (47) ఈనెల 6వ తేదిన కూలి పని నిమిత్తం స్టేషన్ పరిధి సీతారామపురం గ్రామం వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియలేదన్నారు. శనివారం ఉదయం సీతారామపురంలోని మురుగు కాలువలో శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులు పాపయ్యగా గుర్తించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు. మృతుని భార్య ముత్యావలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గేమ్ చేంజర్ షూటింగ్ సందడి



ఆత్రేయపురం, జూన్ 8: హీరో రామ్‌చరణ్ కథానాయకుడిగా దర్శకుడు శంకర్ నిర్మిస్తున్న గేమ్ చేంజర్ సినిమా సన్నివేశాలను కోనసీమలో పేరవరం ఆర్అండ్‌బీ రోడ్డుపై శనివారం చిత్రీకరించారు. రోడ్డు పక్కనే కొబ్బరిబొండాలు, తాటి ముంజుల దుకాణాలు , హైటెక్ బస్సు అరటి లోడ్‌తో వెళుతున్న సైకిల్‌ను ఢీకొట్టడం, యువకులు సైకిళ్ళపై వెళ్తున్న దృశ్యాలను చిత్రీకరించారు. రామ్‌చరణ్ అభిమానులతో ఆ ప్రాంతం రద్దీ అయింది.



కైకలూరులో రామోజీరావు చిత్రపటం వద్ద టీడీపీ నేతల నివాళి



నూజివీడు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పార్థసారథి నివాళి



ముసునూరులో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



మట్టగుంటలో టీడీపీ నాయకుల నివాళి

రామోజీరావు మృతికి సంతాపం

» చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు » సినీ, పత్రికా రంగాలకు తీరని లోటన్న వక్తలు

ఈనాడు-ఈటీవీ అధినేత రామోజీరావు మృతితో యావత్ రాష్ట్రం మూగబోయింది. ఆయన మృతి చెందారన్న వార్తను ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. పత్రికా, సినీ రంగాలకు ఆయన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కైకలూరు, జూన్ 8: పద్మ విభూషణ్, ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావు మరణం తీరని లోటని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శనివారం కైకలూరు తాలుకా సెంటర్లోని టీడీపీ కార్యాలయం వద్ద రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కృష్ణాజిల్లా పెదపారుపూడి గ్రామంలో జన్మించి అంచెలంచెలుగా ఎదుగుతూ ఈనాడు, ఈటీవీ సంస్థల ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎన్నో సేవలను అందించారని కొనియాడారు. అలాంటి మహోన్నతమైన వ్యక్తి మరణం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకే కాక దేశానికే తీరని లోటన్నారు. సమాజంలో సమస్యలను, ప్రభుత్వాలు చేసే తప్పులను ఎత్తిచూపుతూ ఈనాడు సంస్థ ద్వారా సేవలను అందించారన్నారు. నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, మాజీ జడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మి, వడ్డి సాధికార సమితీ కన్వీనర్ బలే ఏసురాజు, టీడీపీ నాయకులు కేకే బాబు, పి. రాధాకృష్ణ, వీరాబత్తిన సుధా, ఆగోళ్ళ బలేస్వామి, వేములపల్లి కారుణ్య, బాజానీ, డోకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి అత్యంత బాధాకరమని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ అన్నారు. శనివారం మట్టగుంటలో టీడీపీ నాయకులతో కలసి రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టించి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశారన్నారు. టీడీపీ నాయకులు తిరుమాని పాండురంగారావు, కోకా తాతయ్య, వడుగు గణపతి, దున్న సత్యనారాయణ, రాజనాల పరశురామయ్య, పరశురాముడు, వాతాడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలో టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ కార్యాలయం వద్ద రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి వినోద్‌తోపాటు టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, దాకరం సర్పంచ్ జాస్తి రాజా, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వంతగాని సురేష్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. కాగా ముదినేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి ఒక ప్రకటనలో రామోజీ మృతి పట్ల సంతాపం తెలిపారు. అల్లూరులో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

నూజివీడు: ఈనాడు పత్రిక స్థాపనతో జర్నలిజంను కొత్త పుంతలు తొక్కించిన రామోజీరావు తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని సేవ చేశారని నూజివీడు ఎమ్మెల్యే పార్థసారథి నివాళులర్పించారు. నూజివీడు పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి సారథి, టీడీపీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, పార్టీ నూజివీడు మండల, పట్టణ అధ్యక్షులు ముసునూరి రాజా, మల్లిశెట్టి జగదీష్, పార్టీ నాయకుడు శివరామకృష్ణ, కౌన్సిలర్లు కొమ్మన విజయ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: రామోజీరావు మృతికి టీడీపీ నూజివీడు మండల నాయకుడు ముసునూరి రాజా, బత్తులవారిగూడెం సర్పంచ్ లక్ష్మీ కాంతమ్మ నివాళులర్పించారు. బత్తులవారిగూడెంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి పత్రికారంగంలో ఆయన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. సుంకొల్లు మాజీ సర్పంచ్ దొప్పలపూడి సాంబశివరావు, టీడీపీ నాయకులు బత్తుల మాధవరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: రామోజీరావు మృతి పట్ల ముసునూరు టీడీపీ నాయకులు శనివారం సంతాపం తెలిపారు. గ్రామ సచివాలయ సమీపంలో ఆయన చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షుడు దేవినేని డలరామ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొండేటి ఉదయ్‌కిరణ్, పార్టీ గ్రామ అధ్యక్షులు పి.ఆంజనేయులు, నియోజకవర్గ బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నక్కా యెహానుతో పాటు నాయకులు ఘనంగా నివాళులర్పించారు.



ముదినేపల్లిలో టీడీపీ నాయకుల నివాళులు

చాట్రాయి: జర్నలిజంతో సమాజ శ్రేయస్సుకు పాటుపడిన రామోజీరావు మృతి రాష్ట్రంతో పాటు దేశానికి తీరనిలోటని టీడీపీ మండల నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు. పేదల సమస్యల పరిష్కారం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం మీడియా ద్వారా రామోజీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చిట్టిబాబు, నాయకులు బొట్టు లక్ష్మణరావు, నోబుల్‌రెడ్డి, దుర్గారావు తదితరులు సంతాపం తెలిపారు.

పీఏసీఎస్‌ల త్రిసభ్య కమిటీలు రద్దు

అధ్యక్షులు, సభ్యుల నుంచి రాజీనామాల స్వీకారం



సీఈవోకు రాజీనామా పత్రం అందిస్తున్న దాకరం త్రిసభ్య కమిటీ చైర్మన్ సత్యనారాయణ

ముదినేపల్లి, జూన్ 8 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల త్రిసభ్య కమిటీలు శనివారంతో రద్దయ్యాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో నామినేట్ అయిన ఈ త్రిసభ్య కమిటీల పాలనకు తెరపడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో గత ప్రభుత్వం నామినేట్ చేసిన కమిటీల అధ్యక్షులు, సభ్యుల నుంచి రాజీనామాలు సేకరించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సహకార శాఖ డివిజనల్ కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ శనివారం పీఏసీఎస్ సీఈఓలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ముదినేపల్లి మండలంలోని 14 పీఏసీఎస్‌ల త్రిసభ్య కమిటీల నుంచి సంఘాల సీఈవోలు శనివారం రాజీనామాలు సేకరించి ఏలూరు కో-ఆపరేటివ్ డీఆర్‌కు పంపారు. దీంతో గత ఐదేళ్లుగా పీఏసీఎస్‌లకు కొనసాగుతున్న నామినేటెడ్ కమిటీల శకం ముగిసింది. 2019 నుంచి ఇప్పటి వరకు సహకార సంఘాలు నామినేటెడ్ త్రిసభ్య కమిటీల ఏలుబడిలోనే ఉన్నాయి. ప్రస్తుతం రద్దయిన కమిటీ తొమ్మిదోసారి నామినేట్ అయింది.

మండవల్లిలో వైసీపీకి ఎదురుదెబ్బ

గతంలో ఎన్నడూ లేని రీతిలో కూటమికి మెజార్టీ

సైలెంట్ ఓటింగ్‌తో వైసీపీకి గుణపాఠం

మండవల్లి, జూన్ 8: మండవల్లి మండలంలో వైసీపీకి చావుదెబ్బ తగిలింది. నాడు కాంగ్రెస్ నుంచి వైసీపీ వరకు కాంగ్రెస్ పక్షనే మండవల్లి మండలం మెజార్టీతో ముందుకు సాగేది. ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సైతం వైసీపీ ఆధిపత్యం సాధించింది. అయితే ప్రస్తుతం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి ఎదురు దెబ్బ తగిలింది. మండలంలోని సుమారు 5 వేలు పైచిలుకు ఓట్లతో తెలుగుదేశంపార్టీ మెజార్టీ సాధించింది. అదే రీతిలో మండవల్లి మేజర్ పంచాయతీలో 972 ఓట్లు తెలుగుదేశం పార్టీకి మెజార్టీ వచ్చింది. మండవల్లిలో నాలుగు పోలింగ్ బూత్‌లు ఉండగా ఒక పోలింగ్ బూత్ మినహా మూడు బూత్‌లలోనూ టీడీపీ ఆధిపత్యం చాటింది. వైసీపీకి కంచుకోటగా ఉన్న మండవల్లి మండలం తెలుగుదేశం పక్షకు చేరింది. మండలంతో పాటు మండవల్లి మేజర్ పంచాయతీ కూడా టీడీపీ చెంతకే చేరింది. 38వ బూత్‌లో 158 ఓట్లు టీడీపీ మెజార్టీ సాధించింది. 39వ బూత్‌లో 525, 40వ బూత్‌లో 326 ఓట్లతో టీడీపీ మెజార్టీ సాధించింది. కేవలం 41వ బూత్‌లో 67 ఓట్లు మాత్రమే వైసీపీ ఆధిపత్యం చాటింది. దీంతో మండవల్లి నాలుగు బూత్‌లలో 972ఓట్లు టీడీపీ ఆధిపత్యం రావడం వైసీపీలో కలవరం మెదలైంది. మండవల్లి మండలం వైసీపీకి భారీ మెజార్టీ వస్తుందని ఊహించిన వైసీపీ నాయకులు కలలు పగటి కలలుగానే మారాయి. మెజార్టీ వస్తుందన్న ధీమాతో నేతలు చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ఓటర్లు మాత్రం సైలెంట్ ఓటింగ్‌తో వైసీపీకి దిమ్మతిరిగే దెబ్బకొట్టారు. మండవల్లిలో టీడీపీ మెజార్టీ రావడం ఆ పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు రేకెత్తిస్తోంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో రాత్రి 8 గంటల వరకు ఓటింగ్ జరిగి 87 శాతం పోలింగ్ నమోదు వైసీపీ శ్రేణులు తమకు అనుకూలం అనుకున్నారు. అయితే అది టీడీపీకి లాభించింది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, మట్టి మాఫియా వంటి సమస్యల్ని ఓటర్లు గట్టిగా గ్రహించి, సైలెంట్ ఓటింగ్‌కి చేశారన్నది పరిశీలకుల అంచనా.





మర్లపాలెంలో టీడీపీ శ్రేణుల విజయోత్సవం

మర్లపాలెంలో టీడీపీ శ్రేణుల విజయోత్సవం

చాట్రాయి, జూన్ 8: మర్లపాలెంలో టీడీపీకి 289 ఓట్లు మెజారిటీ రావటంతో ఆ గ్రామ పార్టీ శ్రేణులు శుక్రవారం రాత్రి విజయోత్సవం నిర్వహించారు. నూజివీడు ఎమ్మెల్యేగా కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీగా పుట్టా మహేష్ యాదవ్ భారీ ఆధిక్యతతో ఎన్నికవటంతో పాటు, రాష్ట్రంలో కూటమి జయభేరి మోగించటంతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైకిల్‌ను ఊరేగిస్తూ సంబరాలు జరిపారు. నాయకులు మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే చింతలపూడి ఎత్తిపోతల, తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతులు పునఃప్రారంభించి మెట్ట భూములను సస్యశ్యామలం చేస్తారని, చాట్రాయి మండలానికి మహర్దశ రానున్నదని ఆశాభావం వ్యక్తంచేశారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కొలుసు కమల లక్ష్మి

అన్న క్యాంటీన్లకు పూర్వవైభవం: కమల లక్ష్మి

నూజివీడు టౌన్, జూన్ 8: అన్నార్తుల ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లకు త్వరలో పూర్వవైభవం వస్తుందని, నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సతీమణి కొలుసు కమల లక్ష్మి అన్నారు. నూజివీడు అన్న క్యాంటీన్‌ను సందర్శించిన అక్కడ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రూపాయల కిలో బియ్యంతో పేదల ఆకలి తీర్చేందుకు ఎన్టీఆర్ చర్యలు చేపట్టగా ఆయన బాటలో చంద్రబాబు పేదల ఆకలితీర్చేలా అన్న క్యాంటీన్‌లను ప్రారంభించి ఐదు రూపాయలకే భోజనంతో ఎంతోమంది పేదలు ఆకలిని తీర్చుకున్నారని, అనంతరం ఏర్పడిన వైసీపీ పెత్తందారీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను మూసివేసి వాటిని నిరుపయోగంగా మార్చిందని టీడీపీ ప్రభుత్వం వాటికి పూర్వవైభవం తెస్తుందన్నారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పట్టణ కార్యదర్శి నాగరాజు, కౌన్సిలర్ షేక్ మీరాబాయ్, మాజీ కౌన్సిలర్ గొల్లు దుర్గాదేవి, టీడీపీ నాయకులు యనమదల నాని, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



సీతాదేవి చిత్రపటం వద్ద మాజీ మంత్రులు, టీడీపీ నాయకుల నివాళి



సభలో మాట్లాడుతున్న వక్తలు

చిరస్మరణీయులు యెర్నేని సీతాదేవి

కలిదిండి, జూన్ 8 : విద్యా విధానంలో నూతన సంస్కరణలను తీసుకొచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి చిరస్మరణీయులని పలువురు మేధావులు, వక్తలు, రైతు సంఘాల నాయకులు, మాజీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు నివాళులర్పించారు. శనివారం కొండూరులో సీతాదేవి దశ దిన కార్యక్రమం సందర్భంగా జరిగిన సంతాప సభలో పలువురు మాట్లాడుతూ ముదినేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ముదినేపల్లిలో ఆర్టీసీ బస్ స్టేషన్ భవనం నిర్మాణం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, పోల్‌రాజ్ డ్రెయిన్, కెనాల్స్‌పై వంతెనలు నిర్మాణం, మండల పరిషత్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణం, ఎస్సీ బాలికల వసతి గృహం భవనాల నిర్మాణం లాంటి అభివృద్ధి పనులను చేశారన్నారు. సీతాదేవి భర్త యెర్నేని నాగేంద్రనాథ్ ప్రోద్బలంతో రాజకీయ అరంగేట్రం చేసి టీడీపీలో చేరి ముదినేపల్లి నియోజకవర్గ రాజకీయాల్లో తొలి మహిళా నేతగా కాలుమోపి రెండు పర్యాయాలు టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొంది ఎన్టీఆర్ క్యాబినెట్‌లో విద్యాశాఖ మంత్రిగా పనిచేసి విద్యాశాఖను ప్రక్షాళన చేసి నూతన సంస్కరణలతో విద్యావ్యవస్థకే ఆమె వన్నె తెచ్చారన్నారు. నైతిక విలువలు కలిగి నీతివంతమైన పాలన అందించి ప్రజాసేవకే సీతాదేవి, నాగేంద్రనాథ్ దంపతులు అంకితమ య్యారన్నారు. వారిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాలను నెరవేర్చాలన్నారు. పేదల అభ్యున్నతికి పాటు పడిన సీతాదేవి, నాగేంద్రనాథ్ దంపతుల మృతి ప్రజలకు తీరని లోటు అన్నారు. మాజీ మంత్రులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, పిన్నమనేని వెంకటేశ్వరరావు, కరణం బలరామ్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, రైతు సంఘం నాయకులు చలసాని శ్రీనివాసరావు, ఎం.కోటిరెడ్డి, గోపాలరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధిరావు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ నాగలక్ష్మి, కొండూరు సర్పంచ్ వెంకటలక్ష్మి, టీడీపీ నాయకులు వీరమల్లు నరసింహారావు, బొర్రా చలమయ్య, ఏఎంసీ మాజీ ఛైర్మన్ తాడినాడ బాబు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, కృష్ణా జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ తాతినేని పద్మావతి, యెర్నేని కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాలినడకన ద్వారకా తిరుమలకు...

చాట్రాయి, జూన్ 8: నూజివీడు ఎమ్మెల్యేగా పార్థసారథి, ఏలూరు ఎంపీగా మహేష్ యాదవ్, సీఎంగా చంద్రబాబు గెలుపొంది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే కాలినడకన ద్వారకా తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తామని మండలంలోని కొత్తగూడెం గ్రామ టీడీపీ కార్యకర్తలు మొక్కుకున్నారు. శనివారం సుమారు 100 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గోవింద నామస్మరణతో కాలినడకన ద్వారకా తిరుమల బయలుదేరి వెళ్లారు.

ఎమ్మెల్యే కొలికిపూడికి అభినందన



ముసునూరు, జూన్ 8: తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొలికిపూడి శ్రీనివాసరావుకు టీడీపీ కాట్రేనిపాడు ఎస్సీ నాయకులు శనివారం అభినందనలు తెలియచేశారు. సర్పంచ్ భర్త గద్దెల మోహన్‌రావు, సొంగా ఇస్సాకు, మాజీ సర్పంచ్ బడిపాటి సాంబయ్య గద్దల పుల్లయ్య తదితరులు కొలికిపూడిని సత్కరించారు.



మొక్కు తీర్చుకున్న సర్పంచ్

నూజివీడు టౌన్, జూన్ 8: నూజివీడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో బత్తులవారిగూడెం సర్పంచ్ ముసునూరి లక్ష్మీకాంతమ్మ బత్తులవారిగూడెం రామాలయంలో శనివారం 108 కొబ్బరి కాయలను కొట్టి మొక్కు తీర్చుకున్నారు. నూజివీడు నియోజకవర్గంలో కొలుసు పార్థసారథి విజయం సాధించాలని, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడితే రామాలయంలో 108 కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్రంలో కూటమి విజయ దుందుభి మోగించగా, నూజివీడులో పార్థసారథి ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో ఆమె మొక్కు చెల్లించుకున్నారు. టీడీపీ నూజివీడు మండల అధ్యక్షుడు ముసునూరి రాజా, టీడీపీ నాయకులు బత్తుల మాధవరావు, గ్రామ అధ్యక్షులు జి.పూర్ణచంద్రరావు, సుంకొల్లు మాజీ సర్పంచ్ దొప్పలపూడి సాంబశివరావు, యనమదల మాజీ సర్పంచ్ పల్లెర్లమూడి రామోజీ తదితరులు పాల్గొన్నారు.



కొల్లేరు గ్రామాల్లో కొనసాగుతున్న
కూటమి విజయోత్సవాలు

కైకలూరు, జూన్ 8: వైసీపీ ప్రభుత్వం కొల్లేరు ప్రజలకు చేసిందేమీ లేదని అందువల్లే కొల్లేరు లంక గ్రామాల ప్రజలు కూటమికి భారీ ఎత్తున మెజార్టీ అందించారని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శనివారం కైకలూరు మండలం గుమ్మళ్ళపాడులో కూటమి విజయోత్సవ సభను రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పురవీధుల్లో టీడీపీ నేతలు, ప్రజలు కలసి విజయోత్సవాలు జరిపారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున కూటమి విజయానికి ప్రజలు కృషి చేశారని వారి ఆశయాలకు తగినట్లుగానే చంద్రబాబునాయుడు సంక్షేమం, అభివృద్ధిని రెండింటిని చేసి చూపుతారన్నారు. కైకలూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు, కొల్లేరు సంఘ నాయకులు జయమంగళ సుబ్బారాజు తదితరులు పాల్గొన్నారు.

బొర్రాకు సత్కారం

ముదినేపల్లి రూరల్, జూన్ 8: కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ విజయానికి పాటుపడిన బొర్రా చలమయ్యను శనివారం ముదినేపల్లి మండలం పెనుమల్లి గ్రామంలో కైకలూరు నియోజకవర్గంలోని గౌడ, శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు పోలగాని నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బొల్లా శ్యామలరాజు గౌడ్, బొర్రా శేషు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.



పిల్లల చదువుకు దాత భరోసా

చాట్రాయి, జూన్ 8: చనుబండలో వైన్‌షాపు వాచ్‌మన్‌గా పనిచేస్తున్న విస్సంపల్లి కృష్ణ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో తమ ఇద్దరి పిల్లలను చదివించేదెలా అని మదనపడుతున్న తల్లికి గ్రామానికి చెందిన వంకదారు రాము, సుజాతల కుమార్తె వర్షిత తాను చదివిస్తానని ముందుకు వచ్చారు. శనివారం దాత వర్షిత విస్సన్నపేట శ్రీశ్రీ స్కూల్ ప్రిన్సిపాల్ రఘు, స్థానిక ప్రముఖుడు మోదుగు ముత్తయ్యతో కలసి పిల్లల ఇంటికి వెళ్ళి, ఇద్దరికి టెన్త్ వరకు స్కూల్ ఫీజు, బుక్స్, డ్రెస్‌లు, స్కూల్ బస్ ఫీజులు తానే భరిస్తానని చెప్పటంతో తల్లీ పిల్లలు ఆనందం వ్యక్తం చేశారు. వర్షిత దాతృత్వాన్ని గ్రామస్థులు ప్రసంశించారు.

క్రైం సమాచారం

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ముదినేపల్లి రూరల్, జూన్ 8: రొయ్యల చెరువులో పట్టుబడుకి వెళ్ళిన కూలీ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు ముదినేపల్లి మండలం ప్రొద్దువాక గ్రామానికి చెందిన లాలా దుర్గాప్రసాద్ (32) శనివారం అదే గ్రామానికి చెందిన రైతు చెరువులో రొయ్యలు పట్టుబడికి వెళ్ళాడు. ఈ నేపథ్యంలో చెరువు అడుగున ఉన్న బురద నీటిని మోటారుతో తోడుతూ మోటారు జరిపే యత్నంలో దుర్గాప్రసాద్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. సహచర కూలీలు గమనించి దుర్గాప్రసాద్‌ను హుటాహుటిన కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి పెద్దిబోయిన వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకట్ కుమార్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కూటమి విజయంతో మహిళల ఆనందం

ముదినేపల్లి, జూన్ 8 : కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఘన విజయం సాధించడంతో శనివారం ముదినేపల్లిలోని టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ కొడాలి వినోద్ కార్యాలయం వద్ద మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళా కార్యకర్తలతో పాటు పలువురు మహిళలు పాల్గొని వినోద్‌ను సత్కరించారు. మహిళల అభ్యున్నతికి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతోపాటు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామన్న కూటమి నాయకుల వాగ్దానాల పట్ల మహిళలు విశేషంగా ఆకర్షితులయ్యారని పలువురు పేర్కొన్నారు.